

ఆపదలో అండగా...



ఆమె పేరు ఎస్.సుగుణ. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో వలంటీరుగా పని చేస్తోంది. సంక్షేమ పథకాలను అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించడం, ఆపద సమయాల్లో అండగా నిలవడం, ఒకటోతేదీ తెల్లవారుజామునే అవ్వాతాతలకు తలుపుతట్టి పింఛను డబ్బు చేతికందించి వారి ఆశీస్సులు పొందడం.. ఇది ఆమె ఒకవైపు చేస్తున్న పని. రెండో వైపు చూస్తే ఆపదలో ఉన్న వారిని కుటుంబసభ్యులుగా ఆదుకుంటూ అందరి చేత మన్ననలు పొందుతుంది. మదనపల్లె పట్టణంలో 2020లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో బాహుదా కాలువ పక్కనే ఉన్న బాపనకాలువ, ఓల్డ్‌మైసూర్‌బ్యాంకు కాలనీలు వరదముప్పుకు గురయ్యాయి. లోతట్టు ప్రాంతాలకు వర్షపునీరు చేరింది. విషయం తెలుసుకున్న వలంటీరు సుగుణ ధైర్యసాహసాలతో బాపనకాలువ ప్రాంతాలకు వెళ్లి ఆ ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో కీలకప్రాత పోషించింది.

- మదనపల్లె సిటీ

ఎప్పటికీ మరచిపోలేం



భారీవర్షాలకు మా కాలనీల్లోకి వరదనీరు వచ్చాయి. ఏం చేయాలో అర్థం కాలేదు. ఇలాంటి సమయంలో వలంటీరు సుగుణ మున్సిపల్,పోలీసు, రెవిన్యూ అధికారులతో కలిసి మా కాలనీకి వచ్చారు.ముంపు ప్రాంతాల ప్రజలను అందరికి ధైర్యం చెప్పి నెహ్రూ స్కూలుకు పంపారు. ఇప్పటికి ఆమె చేసిన సేవలు మరిచిపోలేం. -గులాబ్‌జాన్, బాపకకాలువ,మదనపల్లె.

ఉదయాన్నే తలుపు తట్టి సేవలు..



మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ పేరు కె.బాబాఫకృద్దీన్. కరోనా సమయంలో మొలకల చెరువులో విస్తృతంగా సేవలు అందించాడు. ప్రతి నెలా ఒకటో తారీఖున లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి అవ్వా..తాత బాగున్నావా అని చిరునవ్వుతో పలకరించి పింఛన్ అందిస్తున్నాడు. తన పరిధిలోని 50 కుటుంబాలకు ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందించి సేవలు అందిస్తున్నాడు. జగనన్న సురక్ష సర్వే ద్వారా లబ్ధిదారులకు అవసరమైన సేవలను ఉచితంగా అందించి శభాష్ అనిపించుకుంటున్నాడు.

- ములకలచెరువు

కరోనాను సైతం లెక్కచేయక



వృద్ధుడికి పింఛన్ ఇవ్వడానికి బయోమెట్రిక్ తీసుకుంటున్న గ్రామ వలంటీరు పేరు సురేంద్ర నాయక్. పీలేరు పట్టణం బండ్లవంకలో నివాసం ఉంటున్న సురేంద్రనాయక్ కరోనా సమయంలో తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి అవ్వాతాతల ఇంటికెళ్లి వారి బాగోగులు తెలుసుకుంటూ పింఛన్లు పంపిణీ చేశాడు. - పీలేరు

'జగనన్న సురక్ష' పేదలకు వరం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రజల వద్దకే ప్రభుత్వసేవలు అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని కొండామారిపల్లె, మున్సిపాలిటీలోని ప్యారానగర్, గాంధీపురం, నక్కలదిన్నె సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు జరిగాయి. ఎంపీడీఓ భానుప్రసాద్, కమిషనర్ ప్రమీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ తప్పనిసరిగా అందేలా చేయడం కోసం నిర్వహిస్తున్న జగనన్న సురక్షను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీంతో ఎక్కడకు వెళ్లినా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుల,మత,పార్టీలకు అతీతంగా ఎటువంటి వివక్ష లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఫాతిమా, సిద్దలదీపా, వేమారెడ్డి, ఇస్మాయిల్, ఎంపీటీసీ నీరుగట్టిమేరీ, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు ఈశ్వర్‌నాయక్, రేణుక, ముబీనా, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవలు

ములకలచెరువు: జగనన్న సురక్ష ద్వారా అందించే ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సాయిలీలా, సర్పంచ్ రెడ్డెప్ప అన్నారు. బుధవారం గూడుపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశ్వని, వైస్ ఎంపీపీ గోరా వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

జగనన్న సురక్ష..పేదలకు రక్ష

పెద్దతిప్పసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు రక్ష అని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. బుధవారం రాపూరివాండ్లపల్లిలో ఆయా గ్రామ ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ, గృహ సారథుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

బి.కొత్తకోట: నాలుగేళ్లలో ప్రభుత్వం బి.కొత్తకోట మండలానికి రూ.230.58 కోట్లు ఖర్చు చేశారని ఎంపీడీఓ మంగళం శంకరయ్య అన్నారు. బుధవారం మండలంలోని వడిగలవారిపల్లెలో జరిగిన జగనన్న సురక్ష సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మొత్తం 28 పథకాలకు సంబంధించి ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు అందించిన నిధులను వివరించారు. తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఎంపీపీ లక్ష్మనరసమ్మ, ఎంఈవో రెడ్డిశేఖర్, సర్పంచులు చంద్ర, రవికుమార్‌రెడ్డి, గిరిజ రఘునాథరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఏపీ రోల్‌మోడల్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి.

పీలేరు : అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ రోల్‌మోడల్‌గా నిలుస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగుంట్లపల్లె పంచాయతీ నెట్టిబండ కాలనీ, మారంరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం రూ. 50 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఏదోవిధంగా లబ్ధి పొందిందన్నారు. అర్హతున్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, డాక్టర్ హబీబ్‌బాషా, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకులు బాలం నరేంద్రరెడ్డి, దినచంద్రారెడ్డి, సహదేవ, బుల్లెట్ శేఖర్, రమణ, మోహన్‌బాబు, మహితా ఆనంద్ పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌ను పరిశీలించిన ఆర్డీఓ

పీలేరు రూరల్ : పట్టణంలోని జీవీసీఎస్సార్ థియేటర్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభానికి అనుమతుల కోసం యాజమాన్యం మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రాయచోటి ఆర్డీవో రంగస్వామి బుధవారం జీవీసీఎస్సార్ థియేటర్‌ను పరిశీలించారు. థియేటర్‌లో సౌకర్యాలు, సీటింగ్ కెపాసిటీ, మరుగుదొడ్లు, పార్కింగ్, క్యాంటిన్, డాల్బి 7.1 సౌండ్ సిస్టమ్, ఏసీ సౌకర్యం పరిశీలించారు. సౌకర్యాలు అన్ని బాగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

దర్గా మాన్యం భూములపై విచారణ

గుర్రంకొండ: గుర్రంకొండకు సమీపంలోని షంషేర్‌వలీ దర్గా మాన్యం భూములపై జిల్లా వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. గత ఐదు రోజులుగా దర్గామాన్యం భూములు, అక్కడే ఉన్న స్మశానం స్థలంపై గుర్రంకొండ, సంగసముద్రం గ్రామస్తులకు వివాదం నెలకొంది. స్మశానం దున్నేశారని సంగసముద్రం గ్రామస్తులు, దర్గామాన్యంభూములకు కంచె ఎలా వేస్తారని దర్గాముతవలీ కుటుంబీలు వాగ్వాదం చేసుకొన్న సంఘటనలు చోటుచేసుకొన్నాయి. ఈనేపథ్యంలో బుధవారం జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో దర్గామాన్యం భూములను మొత్తం విస్తీర్ణాన్ని సర్వే చేశారు. వక్ఫ్‌బోర్డు రికార్డుల ప్రకారం ఖాతానెం 3023లో 9.72 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ఇందులో సంగసముద్రం గ్రామస్తులకు చెందిన స్మశానాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి. స్మశానంతో పాటు పక్కనున్న భూమిని ఎంతమేరకు ఎంతమేరకు కంచెవేశారు అన్న వివరాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపారు.

సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి

మదనపల్లె సిటీ: సమష్టి కృషితో ఆర్టీసీ సంస్థ అభివృద్ధి చెందుతుందని ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ప్రయాణికుల కోసం సంస్థ కొత్త సర్వీసులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో యాత్ర స్పెషల్ సర్వీసులతో డిపోకు మంచి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఓఆర్, ఈపీకె అధికంగా సాధించాలన్నారు. ఇంధన పొదుపులో ఆర్‌ఎల్ రెడ్డి, పీఎం క్రిష్ణ, గ్యారేజీ విభాగంలో రామమూర్తి, రామకృష్ణ, రెడ్డిబాష, పీవీ చలపతిలకు క్యాష్ అవార్డులు అందించారు. కార్యక్రమంలో సైకాలజిష్టు సుధాకర్‌రెడ్డి, రామమూర్తి, ఆర్టీసీ సీఐ గీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5346 ఎకరాల్లో మామిడి మొక్కల పెంపకం

పీలేరు రూరల్ : జిల్లాలో ఈ ఏడాది 5346 ఎకరాల్లో మామిడి మొక్కలు పెంపకం చేపట్టినట్లు డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. బుధవారం మండలంలోని అగ్రహారం, బోడుమల్లువారిపల్లె వడ్డిపల్లెలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ వర్షాదార పండ్లతోటల పెంపకంలో భాగంగా మామిడి, మునగ, పూల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మద్దిలేటి మాట్లాడుతూ జిల్లాలో 5346 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 4500 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటినట్లు తెలిపారు. వారంలోపు వందశాలం లక్ష్యం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పీలేరు మండలంలో 200 ఎకరాలు లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 350 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీవో మహేశ్వర, టీఏలు, ఎఫ్ఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.